క్లుప్తంగా

నిధుల విడుదలకు హైకోర్టు ఆదేశం



హైకోర్టు ఉత్తర్వులు చూపిస్తున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర హైకోర్టు ఆదేశించినట్లు ఎచ్చెర్ల ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది మొదలవలస చిరంజీవి తెలిపారు. గురువారం ఫరీదుపేటలోని తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. రూ.15 లక్షలతో పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ బెండి అప్పలనాయుడు కోర్టును ఆశ్రయించారని, ఈ నేపథ్యంలో నెల రోజుల్లో బిల్లులు చెలించాలని కోర్టు ఆదేశించినట్లు చెప్పారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిరంజీవి

రణస్థలం: విద్యార్థి దశ నుంచే గొప్ప లక్ష్యాలను ఏర్పరుచుకుని ముందుకు సాగాలని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి అన్నారు. కొండములగాం ఆదర్శ పాఠశాలలో గురువారం గంజాయి, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని హితవుపలికారు. ఇంట్లో ఒకరు వ్యసనానికి బానిసైనా ఇంటిల్లిపాదికి ఎంతో నష్టం వాటిల్లుతుందన్నారు. సమాజాభివృద్ధిలో విద్యార్థులు కీలకమని, మాదక ద్రవ్యాల నిర్మూలనకు మీ వంతు కృషి అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సాయికుమార్

రణస్థలం: మండలంలోని కొండములగాం పంచాయతీలో ఎస్సీ కాలనీకి చెందిన బోనెల మహాలక్ష్మి పూరిల్లు ఇటీవల కాలిపోయింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బియ్యం, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర సరకులను వైఎస్సార్‌సీపీ తరఫున అందజేశారు. ప్రభుత్వం స్పందించి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, ఎంపీటీసీ రెడ్డి వాసు, మాజీ సర్పంచ్ కలిశెట్టి కన్నంనాయుడు, గొర్లె సూర్యనారాయణ, నాయకులు గొర్లె ఈశ్వరరావు, దన్నాన సత్యం తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు ఆర్థిక తోడ్పాటు



మాట్లాడుతున్న మెప్మా పీడీ ఎస్.వి.రమణ

శ్రీకాకుళం: వీధి విక్రయదారులకు ఆర్థిక తోడ్పాటు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామని మెప్మా పీడీ ఎస్.వి.రమణ అన్నారు. స్వానిధి భీ–స్వాభిమాన్ పక్వాడో పక్షత్సవాల్లో భాగంగా గురువారం కళింగ రోడ్డులోని యూనియన్ బ్యాంకులో వీధి విక్రయదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూపీఐ పేమెంట్ విధానంపై వ్యాపారులకు అవగాహన కలిగించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే అధిక మొత్తంలో కొత్త రుణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ అధికారి బి.రాజు అన్నారు. కార్యక్రమంలో సీఎంఎం ఎస్.వెంకటరావు, ఎల్‌హెచ్ బి.భాస్కరరావు, సీఓ పి.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

గార: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దన అన్నారు. గురువారం వమరవల్లి, అంపోలు పంచాయతీల్లో 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ నంబర్, వ్యక్తిగత సమాచారాన్ని తెలియజేయవద్దన్నారు. సైబర్ మోసం జరిగిన గంటలో పోలీసులకు సమాచారం చేరవేస్తే నష్టం తక్కువగా ఉంటుందన్నారు. గంజాయి కలిగి ఉన్నా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరుస్తూ.. కరుస్తూ!



జి.సిగడాం మండలం మెట్టవలసలో గుంపులుగా ఉన్న కుక్కలు

- స్వైర విహారం చేస్తున్న కుక్కలు
- గాయాల పాలవుతున్న చిన్నారులు, వృద్ధులు
- వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుక్కల బెడద ఎక్కువైంది. వీధిలో నడిచి వెళ్తున్నా.. బండిపై ప్రయాణిస్తున్నా అరుస్తూ వెంటాడుతున్నాయి. ఏమాత్రం వాటికి దొరికినా ఇక అంతే సంగతులు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుక్కకాటుకు గురై గాయాల పాలవుతున్నారు. ఇరుకు వీధుల నుంచి విశాలమైన జాతీయ రహదారులు వరకు ఎక్కడ చూసినా గుక్కల గుంపులే దర్శనమిస్తున్నాయి.

బయటకు రావాలంటే హడల్..

➡ శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలల వెనుక నుండే వెంకటాపురం రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పది, పదిహేను కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఓ గుంపు, ప్లే స్కూల్ సమీపంలో మరో గుంపు, రామ మందిరం వద్ద ఇంకో గుంపు, మిగిలినవి యూనియన్ బ్యాంకు వద్ద స్వైర విహారం చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. కాలినడకన వచ్చే వారితో పాటు వాహనచోదకులను సైతం వెంబడిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో స్కూల్ పిల్లలు బస్సు, ఆటోలలో దిగాలంటే భయపడుతున్నారు. వారిని తీసుకురావడానికి వెళ్లిన తల్లులదీ ఇదే పరిస్థితి. ఈ వీధిలో నెల రోజుల వ్యవధిలో ముగ్గురు కుక్క కాటుకు గురయ్యారు.

➡ రాత్రీ, పగలు తేడా లేకుండా కుక్కలు గుంపులుగా చేరి అరుపులతో స్థానికులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. పగటి పూట సైతం కుక్కల అరుపులతో విద్యార్థులు, వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

➡ ఆవులు, గేదెలు పెంచుకునే పశువుల పెంపకందారులకు కూడా కుక్కల బెడద తప్పడం లేదు. ఎవరూ లేని సమయంలో కుక్కల గుంపు చుట్టుముట్టి వెంటపడి మరీ చంపేస్తున్నాయి.



భయపెట్టేలా కుక్కల గుంపు

బాబోయ్ కుక్కలు

➡ ఈ నెల 5న శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద జాతీయ రహదారిపై కుక్క అడ్డంగా రావడంతో మైలపల్లి గురుదేవి (48) అనే మహిళ మృతి చెందగా, కుమారుడు అజిత్ తీవ్రంగా గాయపడ్డాడు.

➡ ఇటీవల నగరంలోని వాంబేకాలనీలో ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసి ఐదుగురిని గాయపరిచింది.

➡ 2023 ఏప్రిల్ 21న జి.సిగడాం మండలం మెట్టవలసలో పైల సాత్విక అనే ఏడాది వయస్సు గల పాప ఆడుకుంటున్న సమయంలో కుక్కలు తీసుకెళ్లి చంపేశాయి. దాదాపు ప్రతిరోజూ నగర పరిధిలో ఎక్కడో ఓ చోట కుక్క కాటు ఘటనలు జరుగుతునే ఉన్నాయి. చాలావరకు ఘటనలు వెలుగచూడటం లేదు.

కానరాని చర్యలు..

కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదు. నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..



కుక్కల నియంత్రణకు ఇప్పటికే ఏబీసీ ద్వారా ఆపరేషన్లు చేపట్టి నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. తిరిగి ఆయా ప్రాంతాల్లోనే విడిచిపెడుతున్నాం. దీంతో కుక్కలు ఎక్కువగా ఉన్నట్లు అనుకుంటున్నారు. ఆపరేషన్లు తరువాత వాటిలో వేగం తగ్గడం, కాన్పులేకుండా ఉండటం వంటివి జరుగుతాయి.

– పి.వి.వి.డి.ప్రసాద్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

భయపెడుతున్నాయి..



గ్రామాల్లో ఎక్కడికక్కడ గుంపులుగుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులతో పాటు ద్విచక్ర వాహనచోదకులను వెంటపడి మరి కరిచి గాయాలుచేస్తున్నాయి. కుక్కకాటుకి గురై ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి.

– బూటు అప్పారావు, బాతువ, జి.సిగడాం మండలం

అక్రమ నిర్మాణదారులపై చర్యలేవీ?

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం
- ప్లానింగ్ సెక్రటరీల సమావేశంలో కమిషనర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.వి.వి.డి ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోకుండా టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది కల్లుమూసుకుని ఉద్యోగాలు చేస్తున్నారా అంటూ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ మండిపడ్డారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణదారులకు తూతూమంత్రంగా నోటీసులిచ్చి ఊరుకుంటే కుదరదన్నారు. అపరాధ రుసుం విధించి అక్రమ నిర్మాణమైతే వెంటనే నిలుపుదల చేయాలని ఆదేశించారు. చాలామంది ప్లానింగ్ సెక్రటరీలు కొంత మంది పేర్లతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వాస్తవమైతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. వ్యాపారాలకు సంబంధించిన ప్రకటనలు ఎక్కడికక్కడ ఏర్పాటుచేయడం సరికాదని, నిర్దిష్ట స్థలాల్లో మాత్రమే ఏర్పాటుచేసుకోవాలన్నారు. కార్పొరేషన్‌కు డబ్బులు చెల్లిస్తేనే ప్రకటన బోర్డులు ఏర్పాటుచేసేందుకు అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశారు. రాజకీయ ఫ్లెక్సీలను సైతం 48 గంటల్లోపే తీసేయాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వరరావు, టీపీఓ ఉమామహేశ్వరరావు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం!



ప్రహరీకి గేటు వేసి ఉన్న దృశ్యం

- అవసరం లేనిచోట్ల మ్యూరల్ పెయింటింగ్స్
- ప్రైవేటు ప్రహరీపై చిత్రాలు వేయించడంపై విమర్శలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు నిలిచిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల సీసీ రోడ్లు లేక బురదగా మారుతున్నాయి. ఇలాంటి చోట్ల యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టకుండా ప్రస్తుతం అంతగా అవసరం లేని మ్యూరల్ పెయింటింగ్స్ ఎక్కడికక్కడ వేయిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెయింటింగ్స్ వేసి ఏడాది కూడా కాకుండానే వాటిపైనే మళ్లీ మళ్లీ వేసి డబ్బులు వృథా చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. నగరంలోని పీఎస్ ఎన్ఎం స్కూల్ సమీపంలో ఓ ప్రయివేటు స్థలం ప్రహరీపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓ కాంట్రాక్టర్ ఇలాగే పెయింటింగ్స్ వేయించారు. ప్రహరీకి గేటు సైతం ఉండటంతో ఆ చిత్రాలు బయటకు పెద్దగా కనిపించే పరిస్థితి కూడా లేదు. అయినా అధికార పార్టీ అండదండలతో చాలాచోట్ల ఇలాగే పెయింటింగ్స్ వేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రహరీపై ఉన్న పెయింటింగ్స్

బోరు.. పట్టించుకోరు!



సింగుపురంలో తాగు నీటి బోరు మొరాయించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ అవసరాలకు ఈ బోరు నీరే ఆధారం. ఇప్పటికై నా అధికారులు స్పందించి బోరు బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

- శ్రీకాకుళం రూరల్

ప్రథమ చికిత్సపై శిక్షణ



ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మగటపల్లి శాంత కుమారి కుట్టు, మగ్గం, పెయింటింగ్ శిక్షణ కేంద్రంలో గురువారం మహిళలకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రోగ్రామ్ మేనేజర్ జి.రమణ వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ జగన్మోహనరావు, ట్రైనర్లు సంతోషి, శ్రీదేవి, పి.సుజాత, పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

నిబంధనలు పాటించాల్సిందే



ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తూ ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవని జె.ఆర్.పురం సీఐ అవతారం హెచ్చరించారు. కోష్ట జంక్షన్‌లో గురువారం ఆటో డ్రైవర్లు, దుకాణదారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.చిరంజీవి, హెడ్‌కానిస్టేబుల్ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

- రణస్థలం

గుర్రపు డెక్క ఇలా.. సాగునీరు ఎలా?



ఎచ్చెర్ల మండల పరిధిలో ఉన్న నారాయణపురం కుడి కాలువలో గుర్రపు డెక్క ఆవరించి ఉంది. దీంతో ఈ ఏడాది నీటి సరఫరాకు ప్రధాన అవరోధంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించటం, కాంక్రీట్‌తో కాలువ మరమ్మతులు చేపట్టడం వంటి చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో సాగునీటి సమస్యలు ఉండవని రైతులు చెబుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

రెవెన్యూ సదస్సుతో విద్యార్థులకు ఇక్కట్లు


- పంచాయతీ కార్యాలయాన్ని కాదని స్కూల్ కాంప్లెక్స్‌లో నిర్వహణ
- టీడీపీ నేతల మాటలకే తలొగ్గిన అధికారులు



స్కూల్ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: ఒకవైపు పాఠశాల, మరోవైపు అంగన్‌వాడీ కేంద్రం.. ఈ రెండింటి మధ్యన రెవెన్యూ సదస్సు నిర్వహించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు. మైక్ సౌండ్ కారణంగా పాఠాలు వినలేక అసౌకర్యానికి గురయ్యారు. మండల పరిధిలోని వాకవలసలో గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామంటూ వీఆర్‌ఓ గ్రామస్తులకు ముందస్తుగా తెలియజేశారు. అయితే తెలుగుదేశం నేతల ఆదేశాల మేరకు సమావేశం వేదికను మార్చేశారు. అందరూ స్కూల్ వద్దకు వెళ్లాలని చెప్పడంతో పాఠశాల ఆవరణలోనే సదస్సు ఏర్పాటు చేశారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు బోధించలేక ఇబ్బందులు పడ్డారు. తరగతులు సరిగ్గా వినిపించక చిన్నారులు సైతం అవస్థలు పడ్డారు. అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలతో వచ్చిన తల్లులు సైతం మధ్యాహ్నం వరకూ రెవెన్యూ సదస్సుల్లోనే ఉండాల్సి వచ్చింది. ఈ విషయమై గ్రామస్తులంతా సెక్రటరీని ప్రశ్నించగా.. తనకు రెవెన్యూ సదస్సులతో సంబంధం లేదని, వీఆర్‌ఓ చూస్తారంటూ మాట దాటవేశారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వి.సందీప్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: యువత నేరాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ హితవుపలికారు. కుప్పిలి మోడల్ స్కూల్/జూనియర్ కళాశాలలో గురువారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీవితంలో ముందుకు సాగాలన్నారు. గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం, సిగరెట్ జోలికి పోవద్దని చెప్పారు. మహిళలు, పెద్దలను గౌరవించాలని సూచించారు. పోలీస్ కేసుల్లో ఇరుక్కొని విలువైన జీవితం నాశనం చేసుకోవద్దని హితవుపలికారు.

యూనియన్ బ్యాంకు సేవలు భేష్



బ్యాంక్ అధికారులను అభినందిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా యూనియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో పలు చోట్ల రూ.75లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం యూనియన్ బ్యాంక్ సిబ్బంది కృషి ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.వెంకట తిలక్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్లో 1965–66 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న మిత్రుడికి అండగా నిలిచారు. జి.నాగేశ్వరరావు అనే వ్యక్తికి కుట్టుమిషన్ కొనుగోలు చేసుకునేందుకు గురువారం రూ.15,800 అందజేసినట్లు పూర్వ విద్యార్థుల ప్రతినిధి చాగంటి బాపయ్యపంతులు తెలిపారు.


విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గార: తూలుగు సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో గార, కుమ్మరిపేట, కొయ్యానపేట, చినతూలుగు, శాలిహుండం రక్షిత నీటి పథకానికి శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

26న కంటి వైద్య శిబిరం

రణస్థలం: జె.ఆర్.పురం బ్రాహ్మణవీధిలోని కళ్యాణి కంటి పరీక్షా కేంద్రంలో ఈ నెల 26న ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు ఎస్.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంఘం సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

తిలక్‌నగర్‌కాలనీలో పారిశుద్ధ్య పనులు



డస్ట్‌బిన్‌లో చెత్తను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

శ్రీకాకుళం: నగరంలోని తిలక్‌నగర్ కాలనీలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పది రోజులుగా కాలనీలో పారిశుద్ధ్య పనులు జరగకపోవడంతో చెత్త పేరుకుపోయిన విషయమై బుధవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. కాలనీలో చెత్తను తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా బాల వికాస్



ఇలిపురం కూడలిలో సామూహిక సత్యవ్రతాలు



న్యూకాలనీలో విద్యార్థులకు క్విజ్ పోటీలు



పెద్దమందిరంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు సత్యసాయి మందిరాలలో గురువారం బాలవికాస్ ఘనంగా నిర్వహించారు. న్యూకాలనీ మందిరంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా.. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాతశ్రీకాకుళంలోని గణేష్ మందిరంలో చిన్నారుల లఘునాటికల ప్రదర్శన, నృత్యాలు ఆద్యంతం అలరించాయి. పెద్దమందిరంలో బాలవికాస్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఇలిసిపురం కూడలి వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో నల్లబాటి కృష్ణమూర్తి, విజయలక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: మద్యం మత్తులో దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. బుధవారం రాత్రి పెదపాడు రోడ్డులోని డీసీసీబీ కాలనీ సమీపంలో డిపార్ట్‌మెంట్ స్టోర్‌కు వస్తున్న చింతపల్లి నవీన్‌కుమార్‌ను గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్డగించారు. వాగ్వాదానికి దిగి చాకుతో దాడికి పాల్పడ్డారు. వీరంతా మద్యం మత్తులో ఉన్నట్లు బాధితుడు పోలీసులకు తెలిపారు. వారిని గుర్తుపట్టలేకపోవడంతో సమీపంలోని సీసీ ఫుటేజీను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.